క్లుప్తంగా

పరామర్శ


సాంబశివరాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బేబినాయన, బంగార్రాజు

గుర్ల: మండలంలోని కెల్లకు చెందిన టీడీపీ నేత కె. సాంబశివరాజు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కుటుంబాన్ని బొబ్బిలి ఎమ్మెల్యే బేబినాయన, ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు శనివారం పరామర్శించారు. సాంబశివరాజు కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

మద్యం జోలికి వెళ్లొద్దు..



అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ సీఐ రాజశేఖరనాయుడు, తదితరులు

కొత్తవలస: యువత మద్యం జోలికెళ్లి జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎక్సైజ్ సీఐ రాజశేఖరనాయుడు అన్నారు. మండలంలోని ముసిరాంలో శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. మద్యం అతిగా తాగడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని చెప్పారు. మద్యానికి బానిసలైన వారికి రీహ్యాబిలిటేషన్ సెంటర్‌కు తరలించి కౌన్సెలింగ్ ఇప్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది ప్రసాద్, వీర్రాజు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి


కుట్టు శిక్షణార్థులతో ఎమ్మెల్యే కోళ్ల, తదితరులు

వేపాడ: మహిళలు ఆర్థికంగా ఎదగాలన్న లక్ష్యం మేరకు మహిళలకు టైలరింగ్ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. ఈ మేరకు వల్లంపూడిలో టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సూర్యనారాయణతో పాటు జెడ్పీటీసీ సభ్యుడు ఎస్.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ఖాసాపేట రోడ్డు


లక్కవరపుకోట-ఖాసాపేట రోడ్డులో దట్టంగా పెరిగిపోయిన పిచ్చి మొక్కలు

లక్కవరపుకోట: లక్కవరపుకోట నుంచి ఖాసాపేట, కొట్యాడ మీదుగా జామి మండలం గొడుకొమ్ము వెళ్లే రోడ్డు అత్యంత ప్రమాదకరంగా మారింది.ఈ రోడ్డులో ఇరువైపుల పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. గతంలో ఆర్‌అండ్‌బీ అధికారులు జంగిల్ క్లియరెన్స్ చేసేవారు. ఇటీవల కాలంలో జంగిల్ క్లియరెన్స్ చేపట్టకపోవడంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకిరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను తొలిగించాలని పలువురు కోరుతున్నారు.

చుక్కవలసలో పల్లెనిద్ర


అవగాహన కల్పిస్తున్న ఎస్సై లోకేశ్వరరావు

చీపురుపల్లి రూరల్ (గరివిడి): గరివిడి మండలంలోని చుక్కవలసలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో శనివారం రాత్రి పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై లోకేశ్వరరావు గ్రామస్తులతో సమావేశమై మత్తు పదార్థాలు, ట్రాఫిక్ రూల్స్, సైబర్ క్రైమ్, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలకు బానిసైతే కుటుంబాలు రోడ్డున పడతాయని చెప్పారు. ఇటీవల కాలంలో ప్రధానంగా యువత డ్రగ్స్‌కు అలవాటు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు దృష్టి సారించాలని సూచించారు. అదేవిధంగా మైనర్లకు ద్విచక్ర వాహనాలను ఇవ్వొద్దని సూచించారు. బైక్ రైడింగ్ చేసేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, ట్రాఫిక్ రూల్స్‌ను అనుసరించాలని స్పష్టం చేశారు. అలాగే ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.

- పూడికలతో నిండిపోయిన తోటపల్లి కాలువలు
- ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా కానరాని జంగిల్ క్లియరెన్స్
- చీపురుపల్లి సబ్ డివిజన్ పరిధిలో 38,343 ఎకరాల ఆయకట్టు
- 101 గ్రామాలకు అందాల్సిన తోటపల్లి సాగు నీరు


చీపురుపల్లి మండలం రావివలస వద్ద తుప్పలతో నిండి ఉన్న తోటపల్లి కుడి ప్రధాన కాలువ

కాలువలు ఇలా.. నీరు పారేదెలా..?

చీపురుపల్లి: ఖరీఫ్ సీజన్ ముంచుకొచ్చింది.. మరోవైపు వరుణుడి పుణ్యమాని అడపాదడపా వర్షాలు కూడా కురుస్తున్నాయి.. ఈ పరిస్థితుల్లో సాగుకు అన్నదాతలు సిద్ధమవుతున్నారు. ఈ పరిస్థితుల్లో రైతుకు అండగా ఉండాల్సిన ప్రభుత్వం పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. రైతుసేవా కేంద్రాలకు అరకొర విత్తనాలు మాత్రమే వచ్చాయి. ఇదిలా ఉంటే సాగునీరు అందించాల్సిన కాలువలు కూడా అస్తవ్యస్తంగా ఉండడంతో నీటి సరఫరాపై ఆశలు సన్నగిల్లుతున్నాయని రైతులు చెబుతున్నారు. తోటపల్లి కుడి ప్రధాన కాలువలో పూడికలు చూస్తే అసలు ఈ కాలువల్లో నీరు పారుతుందా అనే అనుమానం చిన్న పిల్లాడికి సైతం కలుగుతుంది. ఖరీఫ్ సీజన్ సమయానికి తోటపల్లి కుడి ప్రధాన కాలువలో పూడికలు తొలగించి సాగునీరు సరఫరా చేస్తామని కూటమి ప్రజాప్రతినిధులు సమావేశాల్లో చెప్పడమే తప్ప ఆచరణలో చేయలేకపోయారని అన్నదాతలు మండిపడుతున్నారు. జూన్ నెలాఖరు లేదంటే జూలై మొదటి వారంలో తోటపల్లి సాగునీరు విడుదల చేయాల్సి ఉన్నప్పటికీ, కాలువల్లో జంగిల్ క్లియరెన్స్ చేపట్టకపోవడంతో ఈ సీజన్‌కు సాగునీరు ప్రశ్నార్థకమేనన్న చర్చ నడుస్తోంది.


చీపురుపల్లి మండలం రెడ్డిపేట వద్ద అధ్వానంగా ఉన్న తోటపల్లి కుడి ప్రధాన కాలువ

101 గ్రామాల్లో..

చీపురుపల్లి సబ్ డివిజన్ పరిధిలో చీపురుపల్లి, గరివిడి, గుర్ల, నెలిమర్ల, పూసపాటిరేగ మండలాలున్నాయి. ఐదు మండలాల్లోని 101 గ్రామాల్లో 38,342 ఎకరాల ఆయకట్టుకు తోటపల్లి కుడి ప్రధాన కాలువ ద్వారా సాగు నీరు అందాల్సి ఉంది. అందులో భాగంగానే చీపురుపల్లి మండలంలో 28 గ్రామాలకు గాను 11,232 ఎకరాలు, గరివిడి మండలంలో 12 గ్రామాల్లో 3,843 ఎకరాలు, గుర్ల మండలంలో 30 గ్రామాల్లో 10,046 ఎకరాలు, నెలిమర్ల మండలంలో 11 గ్రామాల్లో 5,742 ఎకరాలు, పూసపాటిరేగ మండలంలో 20 గ్రామాల్లో 7,485 ఎకరాలకు సాగు నీరు అందించాల్సి ఉంది.

ప్రతిపాదనలు చేశాం..

తోటపల్లి కుడి ప్రధాన కాలువలో జంగిల్ క్లియరెన్స్ కోసం ఉపాధిహామీ పథకంలో ప్రతిపాదనలు చేశాం. కానీ ఇంకా నిధులు మంజూరు కాలేదు. ఉపాధిహామీ పథకం నిధులతో జంగిల్ క్లియరెన్స్‌కు చర్యలు చేపడతాం.

– సుచిత్ర, డీఈఈ, చీపురుపల్లి సబ్ డివిజన్

జంగిల్ క్లియరెన్స్ ఊసే లేదు..

సాధారణంగా జూన్ నెల నుంచే ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతుంది. అందుకోసం ప్రభుత్వం ముందుగానే ప్రణాళికలు సిద్ధం చేస్తుంది. అయితే జూన్ నెల సగం అయిపోయినప్పటికీ ఇంతవరకు తోటపల్లి కాలువల్లో పూడికల తొలగింపు మాత్రం జరగలేదు. కాలువలు పూర్తిగా పిచ్చి మొక్కలు, డొంకలతో దర్శనమిస్తున్నాయి. తోటపల్లి రిజర్వాయర్‌కు చీపురుపల్లి సబ్ డివిజన్ చివరిలో ఉంది. రిజర్వాయర్ నుంచి నీరు విడుదలైన తర్వాత చాలా రోజులుకు చీపురుపల్లి సబ్ డివిజన్‌కు చేరుకుంటుంది. ఈ పరిస్థితుల్లో కాలువలు అధ్వానంగా ఉంటే తమ పరిస్థితేమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు.

రక్తదాన శిబిరం..



ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా మండలంలోని శివరామరాజుపేటలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఉప సర్పంచ్ ప్రసాద్, కె.జగదీష్, విశ్రాంత ఆర్మీ ఉద్యోగి సుధాకర్, అంజి, తదితరుల నేతృత్వంలో ఏర్పాటు చేసిన శిబిరంలో 33 మంది యువత రక్తదానం చేశారు. కార్యక్రమంలో కేజీహెచ్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు. – శృంగవరపుకోట

కొత్తవలసలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి


అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న కమ్మెళ్ల వెంకట సత్యనారాయణరాజు

కొత్తవలస: విభజన హామీ చట్టం ప్రకారం రాష్ట్రానికి మంజూరైన గిరిజన యూనివర్సిటీని కొత్తవలస మండలం రెల్లి రెవెన్యూ పరిధి అప్పన్నదొరపాలెం సమీపంలో ఏర్పాటు చేయాలని జనసేన పార్టీ క్రియాశీల సభ్యుడు కమ్మెళ్ల వెంకట సత్యనారాయణరాజు డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రచారంలోను, అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా మంత్రి నారా లోకేష్, ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి పలుమార్లు యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామని చెప్పారన్నారు. వారు ఆ మాట నిలుపుకోవాలని కోరుతూ మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అప్పన్నదొరపాలెం గ్రామ సమీపంలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామని 2014 సంవత్సరంలో సుమారు 526 ఎకరాల భూమిని గిరిజనుల దగ్గర నుంచి సేకరించారని తెలిపారు. తీరా ప్రభుత్వాలు మారిన తర్వాత యూనివర్సిటీ మరో ప్రాంతానికి తరలిపోయిందన్నారు. మేము అధికారంలోకి వచ్చిన వెంటనే యూనివర్సిటీ అప్పన్నదొరపాలెంలో ఏర్పాటు చేస్తామని నమ్మబలికి టీడీపీ నాయకులు ఇప్పుడు చేతులెత్తేయడం తగదన్నారు. వర్సిటీ కోసం సేకరించిన భూములను గ్రేహౌండ్స్‌కు కేటాయించడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని బీజేపీ, జనసేన అధినాయకుల దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. అనంతరం గిరిజన యూనివర్సిటీ ప్రాముఖ్యత, ఏర్పాటుపై స్థానికలకు కరపత్రాలను పంపిణీ చేశారు.

• ఎస్‌టీఓలకు సత్కారం


బదిలీపై వెళ్లిన ఎస్‌టీఓ నూకరాజును సత్కరిస్తున్న విశ్రాంత ఉద్యోగులు సంఘ నాయకులు

చీపురుపల్లి: విశ్రాంత ఉద్యోగులకు సబ్ ట్రెజరీ అధికారులు నిరంతరం విలువైన సేవలు అందిస్తున్నారని.. అవే సేవలను భవిష్యత్‌లో కూడా కొనసాగించాలని విశ్రాంత ఉద్యోగుల సంఘ ప్రతినిధులు అన్నారు. పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఎస్‌టీఓలను శనివారం సత్కరించారు. ఇంతవరకు చీపురుపల్లి ఎస్‌టీఓగా విధులు నిర్వహించి విజయనగరం బదిలీపై వెళ్లిన ఎం.నూకరాజును.. సాలూరు నుంచి బదిలీపై చీపురుపల్లి ఎస్‌టీఓగా బాధ్యతలు స్వీకరించిన వై.కామునాయుడులను సన్మానించారు. ఇంతవరకు ఇక్కడ పనిచేసిన ఎస్‌టీఓ నూకరాజు ఎంతో విలువైన సేవలు అందించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు పి.సత్యం, కార్యదర్శి అంపోలు సత్యనారాయణ, కోశాధికారి కె.జగన్నాథం, గౌరవాధ్యక్షుడు సుబుద్ధి లక్ష్మణరావు, ఎంఎఎస్.రాజు, గరివిడి మండల విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు వై.సత్యం, కార్యదర్శి మోహనరావు, కోశాధికారి కె.పైడినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

జిందాల్ నిర్వాసితుల నిరసన


బొడ్డవరలో ఎమ్మెల్సీ ఇంటి ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న నిర్వాసితులు

శృంగవరపుకోట: నిర్వాసితుల సమస్యల్ని పట్టించుకోకుండా పారిశ్రామికవేత్తలకు కొమ్ముకాస్తున్న ప్రభుత్వాలు తమ గోడు పట్టించుకుని న్యాయం చేయాలని జిందాల్ నిర్వాసితులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బొడ్డవరలో గల ఎమ్మెల్సీ రఘురాజు నివాసం ఎదుట శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2008లో కాంగ్రెస్ ప్రభుత్వం జిందాల్ కర్మాగారం కోసం భూములు తీసుకున్నారన్నారు. 18 ఏళ్లయినా ఇంతవరకు పరిశ్రమ రాలేదని చెప్పారు. భూములు ఇచ్చిన తాము కూలీలుగా మారిపోయామన్నారు. సంస్థ ఇవ్వాల్సిన పరిహారం నేటికీ పూర్తి స్థాయిలో అందలేదని చెప్పారు. కంపెనీ కోసం మేము ఇచ్చిన భూముల్లో ఎంఎస్‌ఎంఈ పార్కుల పేరిట కంపెనీ పెద్దలు, ప్రభుత్వాలు కలిసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాయని ఆరోపించారు. గత ప్రభుత్వం ఎంఎస్‌ఎంఈ పార్కు ఏర్పాటుకు భూమి పూజకు సిద్ధమైనా, నిర్వాసితుల వినతి మేరకు జగన్ సర్కార్ వెనకడుగు వేసిందని తెలిపారు. నిర్వాసితులకు న్యాయం చేసిన తర్వాతే పార్కు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇప్పుడు కూటమి సర్కారు జిందాల్ యాజమాన్యానికి ఒత్తాసు పలుకుతూ భూమిపూజకు సిద్ధపడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. మీ మాటలు నమ్మి నాడు జిందాల్‌కు భూములు ఇచ్చామని, ఇప్పుడు తమకు న్యాయం జరిగేలా చూడాలని రఘురాజును కోరారు. ఎమ్మెల్సీ రఘురాజు స్పందిస్తూ క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవాలను, నిర్వాసితుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

యోగాతో ఆరోగ్యం


యోగాసనాలు వేస్తున్న ఎంపీడీఓ, తదితరులు

దత్తిరాజేరు: ప్రతి ఒక్కరూ యోగా చేయడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్ అన్నారు. పెదమానాపురం సచివాలయం వద్ద గ్రామస్తులతో శనివారం యోగాసనాలు వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 21న జరగనున్న యోగాంధ్ర కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అవగాహన..


వేపాడ: యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు, యాజమాన్య ప్రతినిధులు

వేపాడ: మండల కేంద్రంలోని విక్టరీ హైస్కూల్‌లో విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పించారు. పాఠశాలలో డైరెక్టర్ రాఘవతో పాటు బీజేపీ మండల అధ్యక్షుడు పవన్‌శర్మ, కరస్పాండెంటు దాలినాయుడు, తదితరులు పాల్గొని యోగాసనాల వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు.

ఇద్దరు వైద్యులకు బదిలీ

దత్తిరాజేరు: మండలంలోని రెండు పశువైద్యశాలల్లో పనిచేస్తున్న ఇద్దరు వైద్యులకు శనివారం బదిలీ జరిగింది. దత్తిరాజేరు పశువైద్యాధికారిగా పని చేస్తున్న ఆవినాష్‌కు గజపతినగరం మరుపల్లికి.. పెదమానాపురం పశువైద్యాధికారిగా పని చేస్తున్న దినేష్‌కు డెంకాడకు బదిలీ జరిగింది. వీరి స్థానాల్లో కొత్తవారు రావాల్సి ఉంది.

సగం సగం పనులేనా..!

- నిలిచిన గర్భాం, గరివిడి ప్రధాన రహదారి మరమ్మతులు
- ఇబ్బందుల్లో వాహనదారులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు


అధ్వానంగా ఉన్న చినబంటుపల్లి జంక్షన్ నుంచి గరివిడి వెళ్లే ప్రధాన రహదారి

మెరకముడిదాం: మండలంలోని గర్భాం నుంచి గరివిడి వెళ్లే ప్రధాన రహదారిలో ఏర్పడిన గోతులను పూడ్చేందుకు కూటమి ప్రభుత్వం రూ.40 లక్షలను మంజూరు చేసింది. అయితే గర్భాం నుంచి చినబంటుపల్లి జంక్షన్ వరకు రూ.25 లక్షలతో మరమ్మతులు చేపట్టారు. చినబంటుపల్లి జంక్షన్ నుంచి గరివిడి వరకు ఉన్న రహదారిలో ఏర్పడిన గోతులను రూ. 15 లక్షలతో పూడ్చాల్సి ఉన్నప్పటికీ, సంబంధిత కాంట్రాక్టర్ పనులు పూర్తి చేయలేదు. దీంతో రోడ్డు అస్తవ్యస్తంగా ఉండడంతో వాహన చోదకులకు ఇబ్బందులు తప్పడం లేదు. మెరకముడిదాం, దత్తిరాజేరు, గరివిడి, చీపురుపల్లి మండలాలకు చెందిన వివిధ గ్రామాలకు చెందిన వాహనదారులు ఈ రహదారిపై రాకపోకలు సాగిస్తుంటారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సైతం నిత్యం ఈ రహదారిపై రాకపోకలు చేస్తుంటారని, వారు కూడా స్పందించకపోవడం శోచనీయమని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యుత్ లైన్‌ను బాగుచేసేదెన్నడో..?


యాడిక గ్రామంలో ఈదురు గాలులకు విరిగిపడిన విద్యుత్ స్తంభం


తెగిపడిన విద్యుత్ తీగలు

మెరకముడిదాం: మండలంలోని యాడిక గ్రామంలో వ్యవసాయ పంపుసెట్లకు వెళ్లే ప్రధాన విద్యుత్‌లైన్ ఇటీవల కురిసిన గాలి వర్షానికి నెలకూలింది. అయితే ఈ సంఘటనలో కొన్ని విద్యుత్ స్తంభాలు కూడా నేలకొరిగాయి. అయితే ఈ విషయాన్ని విద్యుత్ శాఖాధికారులకు రైతులు పలుమార్లు విన్నవించారు. అయినప్పటికీ వారి నుంచి ఎటువంటి స్పందన లేదని గ్రామానికి చెందిన రైతులు బొత్స మోహనరావు, పాచిపెంట బలరాం, రెడ్డి రామునాయుడు, సావు సింహాచలం, తదితరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్తంభాలు, విద్యుత్ లైన్ పడిపోయి వారం రోజులవుతున్నా, ఇంతవరకు బాగు చేయలేదని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం


అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు


పూజలందుకున్న వేంకటేశ్వరస్వామి

గజపతినగరం: మండల కేంద్రంలోని కేతలనగర్‌లో వెలసిన వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని కేతల ఆంజనేయమూర్తి, రత్నకుమారి దంపతులు శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రతిఏటా ఆలయ వార్షికోత్సవం నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. మధ్యాహ్నం నిర్వహించిన భారీ అన్నసమారాధనలో సుమారు నాలుగు వేల మంది భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

15వ ఆర్థిక సంఘ నిధులు మళ్లించడం సరికాదు..

బొండపల్లి: పంచాయతీల్లో అభివృద్ధి పనుల కోసం కేటాయించిన 15వ ఆర్థిక సంఘ నిధులను పంచాయతీలకు జమ చేయకుండా మళ్లించి.. ఏడాది తర్వాత తల్లికి వందనం కింద చెల్లింపులు చేయడం దారుణమని వైఎస్సార్‌సీపీ గ్రీవెన్స్‌సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు మహంతి రమణ శనివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. గత ప్రభుత్వం అమ్మఒడి కింద ప్రతి ఏడాదీ నిధులు మంజూరు చేయడంతో పాటు పాఠశాలల్లో పిల్లల సంరక్షణ కోసం రెండు వేల రూపాయలు చొప్పున తల్లిదండ్రుల అనుమతితో స్కూల్ ఖాతాల్లోనే జమ చేయడం జరిగిందన్నారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం తల్లిదండ్రుల అనుమతి లేకుండానే రెండు వేలు చొప్పున కోత విధించి ఆ నిధులను కలెక్టర్ ఖాతాలో జమ చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. అలాగే ఎన్నికల్లో ఇచ్చిన ఒక్క హామీని కూడా ఇంతవరకు పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆరోపించారు. కూటమి ఏడాది పాలనపై ప్రజలు విరక్తి చెందుతున్నారని పేర్కొన్నారు.

ప్రమాదకరంగా గొయ్యి..

దత్తిరాజేరు: మండలంలోని పోరలి క్వారీ సమీపంలో బీటీ రోడ్డుపై ఏర్పడిన గొయ్యి ప్రమాదకరంగా మారింది. ముఖ్యంగా వాహనదారులు ఈ గొయ్యి వల్ల ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు నిత్యం ఈ రహదారి మీదుగా రాకపోకలు సాగిస్తున్నా పట్టించుకోకపోవడం దారుణమని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి గొయ్యిని పూడ్చాలని పలువురు కోరుతున్నారు.


ప్రమాదకరంగా మారిన గొయ్యి